


# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

సెప్టెంబర్ 2013

సంపుటి : 19 (225) సంచిక : 9





## ఎంతటి బద్ధశత్రువునైనా కట్టిపడేసేది 'ప్రేమ' ఒక్కటే!

**ఎంతటి సుగంధ సుపరిమళ పూలవనమునైనా కాల్చి బుగ్గిచేసేది ద్వేషమే! -విద్వేషం గొలిపి, విభజన ద్వేషాలు రగిల్చి, వినోదించు అనేది తెల్లవాని లక్షణం! -విభజించు విడిగా ఉంటూ భుజించుడు !**

**1947** సం॥ము ఆగస్టు 14 అర్ధరాత్రి, రాక్షస సంచారం జరిగే అగ్ని కణ కాలంలో బ్రిటిష్‌వారు భారతదేశాన్ని రెండు ముక్కలుగా విడగొట్టి దాస్యసంకెళ్ళు విడగొట్టామన్నారు. గొంతుకోస్తున్నట్టి రుధీర రక్తధారలను మనవారు మహాప్రసాదంగా ఆస్వాదించారు. ఆ రుధిరం త్రాగిన మనవారి రక్త కణాల్లో బానిసత్వ కణాలు బాహాటంగా చొరబడ్డాయి.

విడిపోయిన రెండు దేశాల్లోనూ ఒకటి పాకిస్థాన్ మరొకటి ఇండియా. హిందూస్థాన్ కానూలేదు; భారత్‌గా పిలువబడనూలేదు. ఇలా ఇంగితం కోల్పోయిన మనపాశ్చాత్య వ్యామోహపు సంస్కృతీవేత్తలు భేష్‌భేష్ ఇండియా అని సంబరపడ్డారు; చంకలు కొట్టుకున్నారు; ఇరువర్గాలవారు కొన్నాళ్ళు కొట్టుకున్నారు. కొందరు ముస్లిములు స్త్రీల కొంగులు లాగారు. ఆబ్రేష్, భేష్‌ల భాషజాల వారి నుంచీ ఇండియా ముక్కలు ముక్కలు కావడం జరిగింది. మేధావులూ, సత్యసంధుడైన, వీరకేసరి పటేల్ వంటివారు కాలి లోని ముల్లును వెంటనే తొలగించాలని, ఐదారువందల సంస్థానములను భారత రిపబ్లిక్‌లో విలీనం చేసుకుని, అనూహ్యంగా ఓ అర్ధరాత్రి భారత సైన్యాన్ని నిజాము పంపి రెక్కలు విరిచారు. అలాటి కోవకు చెందిన దేశాభిమాన నాయకులు లేకపోవడం, తెలివిగలవారిని, త్యాగాలు చేసినవారిని అణగగొట్టడం, నీతి ధర్మ, నియమబద్ధ జీవితాలను గరిపే భారత, రామాయణ, భాగవత గ్రంథాలను అధ్యయనం చేసేవారు కరువవడం, ఉన్నవారిని కాషాయులనడం, కాషాయులలో శక్తిమంతులు లేకపోవడంతో భారతదేశంలో దేశభక్తి తగ్గిపోయింది. వేదద్వేషం, గోవధ, ధర్మం, సత్యం వధ, ధర్మం చెఱసాల పాలవడంతో నీతి నిర్మూలమైంది. స్వార్థం భుజాల కెక్కింది. అవినీతి శరీరమంతటా బాకింది. ప్రతివానికీ పదవి దాహం ప్రబలింది. దేశం ఏమైనాకానీ తాను సిరిసంపదలు సంపాదించాలి. తమను ఉపేక్ష చేస్తున్నారంటూ. ఉమ్మడి కుటుంబాలు విడిపోయి నట్లుగా విడిపోయి, ఎవరికివారికి స్వతంత్రం ప్రకటించుకునే సంకల్పం సంఘర్షణలకు దారితీసింది. సమ భావనలు విచ్ఛిన్నమయ్యాయి. విధ్వంసాలు పెరిగాయి. అదుపు అనేది లేకపోయింది. ఇదే ఇప్పటి విషమ పరిస్థితికి కారణం భాషా రాష్ట్ర విభజనతో ఏర్పడిన నష్టం కన్నా, ఇప్పటి ఆంధ్రా తెలంగాణా, సీమ వివాదం మూడు ముక్కలాటగా పరిణమించింది. సమర్థుడైన నాయకుడు, నాయకత్వం లేకపోవడం స్వార్థం, సంకుచిత్వం, సంక్షోభం పెరగడంతో దేశాభివృద్ధిని కుదించి వేస్తున్నాయ్. సమాధానం లభించని ప్రశ్నగా మారింది.

నీట మునిగిన భూమిని ముట్టితో పైకి ఎత్తిన వరహామూర్తే దిగిరావాలి. దిగిరాకుంటే జల రాశిలో భూమి మునిగిపోతుంది. దిగిరా దిగిరా వరాహ నరసింహా!



బుధజన విధేయుడు

– గోటేటి శ్రీరామారావు

## తప్పులు మీద తప్పులు చేస్తున్న కేంద్రం!

**భా**రత స్వాతంత్ర్యోద్యమం నుంచీ తప్పులే చేస్తున్నారు. స్వాతంత్ర్యం పొందే సమయమున రెండుగా చీల్చిన దేశాన్ని అంగీకరించడం మొదటి తప్పు. (2) కాశ్మీర్‌ను రెండుగా చీల్చడం ఒక తప్పు. బంగళాదేశ స్వాతంత్ర్య యుద్ధంలో భారతసేనను పంపుట ఒక తప్పు. 'ఆంధ్ర నాయకుల తప్పిదంతో బరంపురం భాషా రాష్ట్రం సిద్ధింపచేసుకుని, ప్రాణతుల్యమైన చెన్నపట్నం, బళ్ళారి, హోసూర్ వంటి గుండెకాయ ప్రదేశాలను వదలుకోవడమొక తప్పు. కర్నూలు రాజధాని చేసుకుని వదలుకోవడం ఒక తప్పు. నిజాము తెలుగువారు కోరారని తెలంగాణాను కలుపుకోవడం ఒక తప్పు. వారి ఆందోళనలతో శాంతి లేదు. ప్రజలకు స్వేచ్ఛలేదు. 45 రోజులు సకలజనుల సమ్మె చేసిన వారితో స్నేహం చేయడం మరి తప్పు. ఇంతకాలమూ 'గాంధీ'ల పేరిట గాంధీకాని కుటుంబానికి దాసోహం చేయడమొక తప్పు. తప్పులపై తప్పులు చేస్తూ ప్రజలను తన్నుకు చావమనడం ఒక తప్పు. సమర్థులైన నాయకత్వం లేకపోవడం మరొక తప్పు.


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**

# సిల్వర్ కింగ్ నాదెళ్ళ సంపత్ – సంపదీయం! ప్రపన్నీయం! ప్రసన్నీయం!

### – శతసంవత్సరాల ఆయుష్షంపదతో వర్ధిల్లిన పూర్ణ పురుషుడు పరమార్థ భూషణుడు – నాదెళ్ళ సంపత్‌చెట్టి సిల్వర్‌కింగ్! బహుశాఖలుగా భాసిల్లే ఆ స్వర్ణసామ్రాజ్యం

**1950–55** ప్రాంతాల్లోని మద్రాసులో వృద్ధతరం వైశ్యవణిజుల రూపగుణ విశేషాలే వేరు. షావుకారుపేటలోని ఓ నాలుగు ముఖ్యమైన వైశ్య గడపలు దాటి వెళ్ళివస్తే చాలు 108 వైష్ణవక్షేత్రాలు చుట్టివచ్చినట్లుండేది. వారి మర్యాద, ఆదరం, సాహితీ వేత్తలపట్ల వారు చూపే గౌరవం అపారం, అమేయం. ఎక్కువగా నా చెలిమి వృద్ధతరంతోనే ఉండేది. ఒక్క ఆర్.ఆర్. నాథం, డా॥ కె.వి. స్వామి, గొల్లపూడి సుబ్బారావు, పి.బి. సుబ్బారావు తక్క, అందరూ పెద్ద వయసులవారే! శ్రీవైష్ణవుల్లా పెద్దపెద్ద నామాలూ, తలపాగాలూ, ఆ పంచెకట్టు, చొక్కా, భుజంపైన వేసుకున్న పట్టు అంచుల కండువా సహితమూ ఓ వైశ్య ప్రభువా అన్నట్లు ఉండేది. కొంతమంది చెవులకు కమ లాల ఆభరణాలు పెట్టుకునేవారు. ఓ రోజు మంచి రోజునే అనుకోవాలి. ఆర్. ఆర్.నాథంతో పరమార్థ భూషణ నాదెళ్ళ సంపత్ చెట్టిగారిని గొల్లపూడి సుబ్బారావుగారితో కలిసాను. ఆ రోజుల్లో గొల్లపూడి సుబ్బారావుగారి కొక్కరికే 'కారు' ఉండేది. ఆయన కారులోనే మేము తిరిగేవారం.



ప్రపన్నకుమార్



ప్రసన్నకుమార్

నాదెళ్ళ సంపత్ చెట్టిగారు నిజంగా పరమార్థభూషణులే! దబ్బ పళ్ళలా ఆయన బుగ్గల్లా నిగనిగ లాడుతుండేవి. ఎన్.ఎస్.సి. బోసు రోడ్‌లో నాదెళ్ల సంపత్‌చెట్టి జ్యువెలరీ ఉండేది. మాటల సందర్భంలో మన మందరమూ శ్రీ సీతారామకళ్యాణ సంఘం పెట్టి, ప్రతీ సంవత్సరమూ సీతారామకళ్యాణం చేద్దామని వారన్నారు. శ్రీరామనవమి సెలిబ్రేషణ్ ట్రస్టు పేరు పెట్టాం. మనమధ్యలో సాహితీ సంపన్నుడైన బ్రాహ్మణయువకుడు (అప్పటికి నాకు 25 సంవత్సరములలోపే) గోటేటి శ్రీరామారావు గారిని సభ్యునిగా వేసుకుందాం. మూలధనంగా మనం ఒక్కొక్కరు వెయ్యినూట పదహారులు. అదే శాశ్వత సభ్యత్వం రుసుంగా వేసుకుని, ఆ మొత్తాన్ని మనకున్న ఫైనాన్స్ కంపెనీలో డిపాజిట్‌గా వేసి, ఆ సంవత్సరం వచ్చిన వడ్డీతో కల్యాణం జరిపిద్దాం' అని నిర్ణయించుకుని, వై.యస్.శాస్త్రిగారిచే ఓ నిబంధనల పత్రం వ్రాయించాం. ఇదీ ఇప్పటి వ్యాసానికి సంబంధరహితమే అయినా పరమార్థ భూషణ సంపత్‌చెట్టిగారితో దగ్గరి సంబంధం ఏర్పడటానికి కారణమీ ఉపోద్ఘాతం.

**నాదెళ్ళ సంపత్‌చెట్టిగారు** వెండి బంగారు నగల వ్యాపారం పెద్దపెట్టున చేస్తున్నందున ఆయన్ను మార్కెట్లో **'సిల్వర్‌కింగ్'** అనేవారు. ఓ చేత్తో సంపాదించిన లాభాలను మరో చేత్తో మంచి పనులకు ఖర్చుపెట్టేవారు. వితరణశీలి, ఆయనతో నగల దుకాణంలో కూర్చున్న ఆయన కుమారుడు ఆదికేశవులుచెట్టిగారు కూడా అదే మార్గం అనుసరించారు. **అలాటి మంచిమనసుగల సంపత్‌చెట్టిగారికి మునిమనుమలూ, ఆదికేశవులు చెట్టిగారికి మనుమలైనవారే ఈ ప్రపన్న, ప్రసన్నకుమార్ లిరువురూ.** నాదెళ్ళ సంపత్‌చెట్టి బంగారు నగల సామ్రాజ్యాన్ని, శాతవాహన రాజులు సామ్రాజ్య విస్తరణ చేసినట్లు, చేస్తూ మద్రాసులోని అనేక వ్యాపార కూడళ్లలో, పరిసర నగరాలలో విస్తరింపజేస్తున్న పరమప్రేమార్థభూషణులీ అన్నదమ్ములు, ముత్తాతకు చెందిన ముత్యాలసరములు.

అలాటి శ్రీమంతుల కుటుంబంలో పుట్టిన ఉదారత ఔదార్యమూ అరుదుగా ఉంటుంది. వ్యాపార రీత్యావారు సరసంగా మాట్లాడినప్పటికీ పెద్దల పట్ల భక్తీ, ఉదారమూ, ఉదానత, ధర్మగుణం, సంస్కృతీ సేవా సంస్థలతో సంబంధమూ అలవడడం అరుదుగా ఉంటుంది.

ప్రపన్న, ప్రసన్నలిరువురినీ చూచినపుడు రామలక్ష్మణులా! బలరామ కృష్ణులా యనిపించక పోదు.

చెన్నయ్‌లో వైశ్యులవే పురాతన బంగారు వాణిజ్య సంస్థలు. వాటిని ఆధునికముగా, కన్ను చెదరేటట్టుగా విస్తరించి చెన్నయ్ నగరమంతా శాఖోప శాఖలుగా చేస్తూ, నిముషానికి నిముషానికీ ఒక కొత్త డిజైనును మార్కెట్లోకి తెస్తున్న రోజుల్లో పోటీ పడినట్టు వ్యాపారం చేస్తున్నారీ కుశలవులు. నాదెళ్ళ సంపత్‌చెట్టి, చెన్నయ్, చెన్నయేతర ప్రాంతాల్లో పెద్దపెట్టున వ్యాపారం చేస్తూ, వచ్చే లాభాలను ట్రస్టు లేర్పరచి, ఆలయాలకూ, ధర్మకార్యాలయాలకు విరాళాలిస్తున్నారు. **ప్రసన్నకుమార్** చిన్నవాడైనా మనసు నందు పెద్దవాడు. ఉదార స్వభావుడు, ఉత్సాహి, సాంప్రదాయ కార్యక్రమాల పట్ల, సామాజిక కార్యక్రమాలపట్ల ఆసక్తికలవాడు. నాకు ఆరోప్రాణం. నిరాడంబరుడు. నిష్కల్మషుడు. సదా నా ఆరోగ్యమును కోరుతుండేవాడు. ఇటీవల ఆయన కుమారుణ్ణి సింగపూర్ యూనివర్శిటీలో ఇంజనీరింగ్ విద్యలో చేర్పించారు. మనసు వెన్న, మాట వన్నెల మధురం వీరి తండ్రితాతలు చేసిన ధర్మకార్యాలను కొనసాగిస్తున్నారు. తిరుమలలోని వీరి సత్రంలో వసతియేకాదు. భోజన వసతి ఉన్నది. మద్రాసులో నాయనమ్మ నాదెళ్ల సులోచనమ్మ పేరిట బృహత్సుందర కల్యాణమండపం ఉన్నది. వాటి లాభాలు జనోపకారమునకే వినియోగిస్తున్నారు.

తరతరాల యీ కుటుంబీకుల పరిచయం కొత్తతరం వారిలో ఉండడం నా అదృష్టం. ●


**Hotel Southern** - New Delhi

**Southern Grand** - Vijayawada











**Hotel Southern at New Delhi** - Is the Largest South Indian Hotel, equipped with 110 rooms with modern amenities, conference hall, with a Vijayawada Restaurant located in the premises, serving the best South Indian Food and Delicacies.

The Hotel is centrally located 2.5 kms from New Delhi Railway Station and 15 kms from Domestic / International Airport.

**Hotel Southern Grand at Vijayawada** - It is a recently opened hotel with 3 star kind of modern amenities and equipped with a total of 37 rooms, conference hall and a Restaurant located in the premises, serving the best South Indian Food and Delicacies.

The Hotel is centrally located 0.5 km from Vijayawada Railway Station and 19 kms from Domestic Airport.

Complimentary : **Breakfast & Transport from Rly. Station / Airport to our Hotel, subject to prior information to our offices**

■ **Bring Your Boarding Pass of Air India Airlines & Avail 10% discount on Room Tariff only**

HOTEL SOUTHERN™
style. comfort. enjoy.

18/2, Arya Samaj Road,
Karol Bagh, **New Delhi.**
Tel.: 4353 2824, 2875 4210,
Fax: 011-2875 7308
e-mail: info@hotelsouthern.com
**Reservations:** Call 011- 4145 0200

26-6-8, Papaiah Street, Opp. Registrar's Office
Gandhi Nagar, **Vijayawada,** Andhra Pradesh
Tel.: 66 77 777, 66 55 777,
Fax: 0866-257 2227
e-mail: bza@hotelsouthern.com




Theater Style Upto 100 Persons

## ఆంధ్రలో పుట్టినా హైదరాబాద్ రాష్ట్ర విముక్తికి అహరహం పోరాడిన

# వల్లూరి బసవరాజు



**వల్లూరి బసవరాజు గుంటూరు జిల్లా బాపట్ల తాలూకా వల్లూరు గ్రామంలో 1914 మే నెల 6వ తేదీన జన్మించారు. ఇరవై సంవత్సరాల వయస్సులో 1934 లో మద్రాసులో సివిల్ ఇంజనీరింగ్ డిప్లొమా పరీక్షలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆ వెంటనే హైదరాబాద్ వచ్చి కష్ట పడి, ఆంధ్ర మహాసభలో పనిచేసి, స్టేటు కాంగ్రెస్ సత్యాగ్రహంలో పాల్గొని ఆ ఉద్యమవిజయానికి తన సర్వసంపదను ధారపోసిన దేశభక్తుడు. ఆయనే కాదు. వారి సోదరులు ఆరుగురు స్వగ్రామంతో తెగతెంపులు చేసుకొని హైదరాబాద్‌లో స్థిరపడిపోయారు. చట్టప్రకారమేకాక మనసా వాచా ముల్కీలైనారు. ఆయన అభ్యుదయవాది. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. రజాకార్ల దౌర్జన్యాలు పెచ్చుమీరి జరుగుతున్న క్లిష్టమైన రోజుల్లో 1947-48 సంవత్సరాలలో విజయవాడలో నెలకొల్పిన హైదరాబాద్ స్టేటు కాంగ్రెస్ జోనల్ కార్యాలయ నిర్వహణ బాధ్యత బసవరాజు తన భుజస్కంధాల మీద వేసుకున్నారు.**

**వి.బి.** రాజుగా ఖ్యాతి చెందిన వల్లూరి బసవరాజు హైదరాబాదు రాష్ట్ర విముక్తికి తెలుగువారి అభ్యున్నతికి అహోరాత్రులూ పోరాడిన రాజకీయ శూరుడు. హైదరాబాద్ శిష్టచతుష్టయంగా తెలంగాణా తెలుగువారి అభ్యున్నతికి పాటుపడిన బూర్గుల రామకృష్ణారావు (అప్పటి ముఖ్యమంత్రి), కె.వి. రంగారెడ్డి, మర్రిచెన్నారెడ్డి, వల్లూరి బసవరాజులను రామ, భరత, లక్ష్మణ, శతృఘ్నులుగా చెప్పుకోవాలి. ఒక్కొక్కరికి శత శతఘ్నులను పేల్చే ధీరత ఉన్నది. వారే లేకుంటే ఈనాడు తెలంగాణావారనిగానీ, ఆనాడు నిజాము తెలుగువారనిగానీ తలచుకునే అవకాశం ఉండేదికాదు. బూర్గుల రామకృష్ణారావు నిజాము రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేయకపోతే ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడేది కాదు. భారతయూనియన్‌లో నిజామును విలీనం చేయడానికి వల్లభాయ్‌పటేల్ ఎలా కారణభూతుడో, నిజాము రాష్ట్ర తెలుగువారు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడానికి తన ముఖ్యమంత్రి పదవిని త్యాగం చేసిన బూర్గులవారంత అంత ముఖ్యమైనవాడు. వల్లూరి బసవరాజు చాణక్యతనం కారణమైంది. కానీ వీరి పేరులు స్మరించేవారు లేరు. వీరితోబాటు పార్లమెంటు సభ్యుడూ, ప్రతిపక్షనాయకుడైన పుచ్చలపల్లి సుందరయ్య స్వరం కలిపి ఆంధ్రప్రదేశ్ ఏర్పడుటకు, నైజాము రాష్ట్రంలోని తెలుగువారికి భద్రత కల్పించుటకు ఆనాటి నాయకులూ, ప్రజలూ ఏకోన్ముఖులయ్యారంటే సుందరయ్యే. వారికి జనాభివృద్ధి, సంక్షేమం తక్క పదవీ కోరికలేదు.

వల్లూరి బసవరాజుగారు ఆనాడో నూరుసత్యాల విశ్లేషణం చేసారు. రాజకీయాలందు 'సత్యమూ- శాశ్వతమూ' ఉందనుకోవడం నేతిబీరకాయలో 'నేయి' ఉందనుకోవడమే! రాజకీయాల్లో స్నేహాలూ, సఖ్యతలూ, శతృత్వాలూ, ద్వేషాలూ, పగలూ, తెగలూ శాశ్వతంగా ఉండవు. అలా భ్రమించడం వట్టి భ్రమే! గర్భశత్రువులూ, గాఢస్నేహితులనేవారు కూడా అరుదే! పొత్తులు కుదుర్చుకోవడం, అంతలోనే విడిపోవడం రాజకీయాల్లో సర్వసామాన్యం. అందుకే ఆయన యుక్తాయుక్తాలూ, ఎత్తుకుపై యెత్తు, సమయస్ఫూర్తి వర్తన, పార్టీలనూ, అంతర్పార్టీలను నిర్మించుకునే సామర్థ్యమూ నైపుణ్యముగల చురుకైన మనిషిగా, సామర్థ్యంగల మహామనిషిగా పేరు తెచ్చుకున్నారు. స్టేటు కాంగ్రెస్‌లో పనిచేసినపుడు స్వామీజీ నాయకత్వంలోనూ, ఆంధ్రమహాసభలోను పనిచేసినపుడు బూర్గుల నాయకత్వంతోనూ పనిచేసారు. నిజాము రాష్ట్రానికి స్వేచ్ఛ లభించిన తరువాత వి.బి.రాజు కార్మిక సంఘాల స్థాపన, కార్మికోద్యమంలోనూ దృష్టిని కేంద్రీకరించారు. ఆంధ్రప్రదేశపు పూర్వపు ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్యగారు వి.బి. రాజు అనుచరుడే.

1950 సం॥ములో వెల్లోడీ మంత్రివర్గంలో ఇద్దరు మంత్రులను చేర్చుకోవలసి వచ్చినపుడు బూర్గుల రామకృష్ణారావుగారినీ రామానందస్వామీజీ తరపున వి.బి. రాజు గారికీ స్టేటు మంత్రివర్గంలో స్థానం లభించింది.

1950లోనే ఆయన మంత్రి పదవిని పొందారు. 1952 సం॥ములో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచీ ఎన్నికయి, మంత్రి వర్గసభ్యులయ్యారు. సహ మంత్రులుగా ఉన్న రంగారెడ్డి, చెన్నారెడ్డిలతో సమస్య ఉత్పన్నమైనపుడు ఢీకొనేవారు. ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుగారిపై ద్వేషం పెంచుకున్నారు. స్వామీజీ అనుచరులు మంత్రి వర్గం నుంచీ బయటకు వచ్చినపుడు రాజు కూడా బయటకు వచ్చారు.

సమయం వస్తే సహకరించేవారు గానీ విచ్ఛిన్నతకు పాలుపడేవారు కాదు. విశాలాంధ్ర ఏర్పాటు సుగమం చేయడానికి బూర్గులవారికి సన్నిహితులై, రంగారెడ్డి, చెన్నారెడ్డిలను అవాక్కు చేసారు. 1956లో మంత్రియై 1959 వరకు ఆ పదవిలో కొనసాగారు. ప్రదేశ్ కాంగ్రెసు ఉపాధ్యక్షులుగా, ఆర్.టి.సి. చేర్మన్ పదవిని కూడా సమర్థవంతంగా నిర్వహించారు. 1956 సం॥ములో ఎన్నికల ట్రిబ్యునల్ యిచ్చిన తీర్పుకు స్పందించి మంత్రి పదవికి రాజీనామా చేసారు. అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి. 1967 సం॥లో ఏర్పడిన బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో రాజు రెవెన్యూ మంత్రిగా పనిచేసారు. చాతుర్యంలో యుగంధర మంత్రియైననూ ఏ మంత్రి పదవిలోనూ ఆయన పూర్తికాలం లేరు. రాద్ధాంతం చేయకపోయినా రాజీపడే మనస్తత్వం కాదు. రథాన్ని నడపడం కన్నా, రథాన్ని నడిపించేవారిని నడిపించడమే ఆయనకు అలవాటు. రాజకీయ నాటకాలాడేవారు కాదు గాని, వెనుకనుండీ నడిపించేవారు.

బసవరాజుగారు ఎన్నో మంచి కార్యక్రమాలకు వెనుకబలంగా ఉన్నప్పటికినీ ఆయన ప్రత్యక్షంగా హైదరాబాద్, సికిందరాబాదు జంట నగరాలకు పరిమితమైనందున రాష్ట్ర నాయకుడిగా పదిమంది కళ్ళలోనూ పడలేదు. కానీ మేధావి వర్గం అందరి చూపుల్లోనూ ఉండేవారు. కానీ ఆయన ఎన్నో ప్రధాన పదవులు చేపట్టారు. రాజ్యసభ సభ్యులయ్యారు. ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా చేసారు. పత్రికారంగంలో కూడా 'మేటి' యనిపిస్తూ 'డెయిలీ న్యూస్' ఆంగ్ల దినపత్రిక సంపాదకత్వం వహించారు. ఎన్ని పదవులు నిర్వహించననూ ఆయన సమర్థతకు తగిన పదవులు రాలేదేని ఆయన సన్నిహితులు బాధపడేవారు.

తెలంగాణాకు ఆంధ్రకు వెలుగునిచ్చిన వి.బి. రాజు 1986 డిసెంబరు 8వ తేదీన ఈ భూమి ఋణం తీర్చుకునిపోయారు. ●

## ఏ నోటి దుర్వార్తయో ఫలించింది!

తథాస్తు దేవతలుంటారనేది వాస్తవం. అది శాపమూ కావచ్చు; హృదయతాపమూ కావచ్చు. మహాభారతంలోని గాంధారి శాపంతో కృష్ణుడూ, దానికితోడైన ఋషి శాపంతో యాదవకులమూ సమ్మూల నాశనమై, సుందర సుభిక్షకరమైన ద్వారకాదీపం సముద్రగర్భంలో మునిగిపోయింది.

### అలాగే

సస్యశ్యామల కోమలమైన ఆంధ్ర- తెలంగాణా ఎంతకాలం ఉంటుందో అని నెహ్రూ హేళనగా అన్నారంటే, పెళ్ళికి అక్షింతలు వేయడానికి ముందు పెళ్ళి కూతురు ముండ ఏదిరా- అని ధ్వనించేట్టు వ్యంగ్య ఆశీర్వచనం చేసారు. ఇది కేంద్ర ప్రధాని గేలీయుత ఆశీర్వచనం ఫలింపు దశకు వచ్చింది.

*If you want Comfortable Stay - Stay at*

badam group

**BADAM BALAKRISHNA HOTEL**

6-1-1081, Lakdi-ka-pool, Hyderabad - 500 004.
Grams : HOTELKRISH
Phone : 23231652, 23231653, 23231654, 66784151, 66784153
Fax : 040 66663114

# అమ్మ, అమ్మమ్మ, మనవరాళ్ళు కలిసి ఒకే వేదికపై నర్తించారు.

అవ్యయంగా ఉండేకాలం (అనంత విశ్వభ్రమణాన్ని రంగులరాట్నంలా తన చుట్టుతానే తిరుగుతూ పరిభ్రమణక్రమాణంలో కళలకు అవరోధం కలిగిస్తూందని విశ్వసించాను. ఐశ్వర్యకారకుడు నటరాజు అయిన మహేశ్వరుడు నృత్య సంగీత లలిత కళలకు అధి దేవతయినందువలన భారతదేశంలో సంగీత, నృత్య కళలకు విఘాతం కలుగకుండా విశ్వవ్యాప్తం కావడానికి భరతముని, సిద్దేంద్రయోగీంద్రుడు, నారాయణతీర్థులు, జయదేవుడు, అన్నమయ, త్యాగరాజు వంటి వాగ్గేయ విభవమూర్తులను సృష్టించాడు. వారి వారసత్వం కుంటుపడకుండా తరతరాలుగా వారసుల్ని తయారు చేస్తున్నవారూ ఉన్నారు.

ఆ మధ్య విశాఖపట్టణంలోని 'కళాభారతి' ఆడిటోరియంలో కూచిపూడి నృత్య కళాకారిణి టేకుమళ్ళ శ్యామల– ఆమె వైవాహిక స్వర్ణోత్సవ (ఆనంద) సందర్భంగా 'నృత్యవర్ధిని' సంస్థ కూచిపూడి నృత్య ప్రదర్శనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఇందు మూడు తరాల నర్తకీమణులు నృత్యం చేసారు. శ్యామలకు ఏడు పదుల వయసులో, ఆమె, ఆమెతోబాటు ఆమె కుమార్తె పార్వతీవర్ధిని శ్యామల, మనుమరాళ్ళు జాహ్నవి, జ్ఞాపిక– ఈ నలుగురూ కలిసి ఒక వేదికపై రమణీయంగా నృత్యం చేయడం, ఎవరూ ఎవరికీ తీసిపోని విధంగా నృత్య ప్రావీణ్యత చూపడం రసజ్ఞులనందర్నీ తన్మయపరచింది. ఎన్నో దశాబ్దాల క్రితం ఆంధ్రప్రదేశ్ పూర్వపు ముఖ్యమంత్రి, కేంద్రమంత్రి కీ॥శే॥ బెజవాడ గోపాలరెడ్డిగారికి విశాఖపట్టణం రాష్ట్రపరంగా సాంస్కృతిక రాజధాని చేయాలని కలలు కనేవారు. ఆయనే గనుక ఈ ప్రదర్శన చూచిఉంటే ఎంతగా ఆనందించేవారో.

గజ్జెకట్టి ముద్రలు పట్టి, నటరాజుకు నృత్యనీరాజనం పలకడం మన సంప్రదాయ కళలకు చెయ్యెత్తి జై కొట్టడమే! అలాంటి కళాకృషి మూడుతరాలవారు ఏకకాలంలో నిర్వహించడం ప్రశంసనీయం. అందునా అమ్మమ్మ, కూతురు, మనవరాళ్ళు కలిసి రంగస్థలంపై నాట్యం చేయడం అరుదూ అద్భుతం. విశాఖ వాకిట అరుదైన సంఘటన కళాప్రియుల మనసులను రంజింపజేసింది.

శ్యామల కుటుంబం కూచిపూడి నాట్యానికి అంకితమైంది. ఇంట్లోని అందరికీ కళలంటే పంచప్రాణాలు. శ్యామల తాను నేర్చుకున్నది తన పిల్లలకే కాదు ఆసక్తిగల



ఏడు పదుల వయసులో కూతురు, మనవరాళ్లకు ధీటుగా... శ్యామల(మధ్యలో ఆఫ్‌వైట్‌శారీ)

ఎందరికో నేర్పించి కళామతల్లి పదపూజలో తరిస్తున్నారు. మూడు తరాల వంశీకుల నృత్య సంరంభం. ఏడుపదులు దాటిన అమ్మమ్మతో మనవరాళ్ళు పందెం కాశారా అన్నట్లున్నది. తానేం తక్కువ తినలేదనట్లుగా గ్రాండ్ మదర్ కూడా గ్రాండ్‌గానే నృత్యం చేసారు. రెండు తరాల వారథిగా కుమార్తె వర్ధిని హావభావాలు పలికించారు. ఇలా ఈ నలుగురు వేదిక మీద పాదాలు కదుపుతుంటే కూచిపూడి గ్రామాన్ని చూసొచ్చినట్టనిపించింది. పురందరదాసు కీర్తనలు, అన్నమయ్య పదాలకు ఆంగికం, వాచకం తోడవడంతో ఆ ప్రాంతమంతా రసప్లావితమైంది. ప్రతి నృత్యాంశానికి ప్రేక్షకులు మంత్రముగ్ధులయ్యారు. ఒకే కుటుంబంలో మూడు కాలాలకు చెందినవారు నర్తించడం, ఆ నర్తన నృత్యహేలగా ప్రేక్షకులను మెప్పించడం అభినందించదగ్గది. టేకుమళ్ళ శ్యామల కూచిపూడి నృత్యానికి జీవితాన్ని అంకితం చేసిన పెద్దమ్మ. ఆమె కుటుంబం చిరాయువుతో ఆంధ్ర నాట్యరంగానికి మరింతగా సేవలందించాలని అంతా ఆశీర్వదించారు. దుఃఖార్తులకు, శ్రమార్తులకు, శోకార్తులకు విశ్రాంతి నివ్వగలిగేది నాట్యమేనన్న భరతముని రససిద్ధాంతాన్ని గుర్తుచేశారు. ●




# బొట్టుపెట్టుకో అమ్మా!

**బొట్టు పెట్టుకోవాలమ్మా!**
**ఉండమ్మా! నే బొట్టుపెడతా!**
**ముందు నే పెట్టుకుని– నీకు**
**బొట్టుపెడతా! మన ఇరువురి సౌభాగ్యం కోరుతా!**

– అనేది భారతీయ సాంప్రదాయం. బొట్టుపెట్టుకోనిదే గడప దాట నిచ్చేవారు కాదు. బొట్టుపెట్టుకోనిదే గుడిగడపలోనికి రానిచ్చేవారు కాదు. భారతీయత లోనిదీ ప్రథమ **సాంప్రదాయం బొట్టు– సౌభాగ్యానికి పెట్టు.**

మన పూర్వీకులు పలు సామాజిక నియమాలను తెలియజేస్తూ అనేక గ్రంథాలు రచించారు. ఆ నియమాలను ఆచారాలను కలిపి మనం సంస్కృతి అంటున్నాము. ఆ సంస్కృతి సంప్రదాయా లలో నిక్షిప్తమైన ఆంతర్యాలను, అంతరార్థాలను మనం తెలుసుకోవలసిన అవసరం ఉంది.

కుంకుమ దిద్దుకోవడం భారతీయ సంప్ర దాయంలోనూ సంస్కృతిలోను ఒక భాగమని ముందే చెప్పాం. యుగయుగాలుగా తరతరాలుగా వస్తున్న ఈ సత్‌సంప్రదాయం అందానికే కాదు, ఆరోగ్యానికి కూడా మంచిది. కుంకుమదిద్దుకునే సమయంలో మనస్సులో తమ ఇష్టదైవాన్ని స్మరిస్తూ మనస్సు లగ్నం చేసి...



**కుంకుమం శోభనందివ్యం**
**సర్వదా మంగళప్రదమ్**
**ధారణీ నాస్య శుభధం**
**శాంతిరస్తు సదామమ!!**

అనే ఈ శ్లోకాన్ని పఠిస్తూ కుంకుమను దిద్దుకోవాలి. కుంకుమ చూపుడువేలుతో పెట్టుకోకూడదు. రెండు కనుబొమ్మల మధ్య బ్రహ్మరంధ్రం ఉంటుందని దానిపై సూర్యరశ్మి తగలకుండా బొట్టు కాపాడుతుందని పెద్దలు అంటారు. అలాగే బొట్టు ధరించడం వలన "ఇన్టాంగ్' అనే పిట్యూటరి గ్రంథి చురుకుగా పనిచేస్తూ మానసిక ఆందోళనను తగ్గిస్తూ మనసును ప్రశాంతంగా ఉండేలా చేస్తుందంటారు. కొందరు ప్లాస్టిక్ బొట్టులు అంటించుకుంటున్నారు. ఎంత దారుణం!

మనదైన సంప్రదాయ సంస్కృతులను పక్కనబెట్టి పొరుగు సంప్రదాయాలకు పరుగులు తీసే వారు భారతీయ సంప్రదాయాన్ని గౌరవించకపోవడం శోచనీయం.

**– బెల్లంకొండ నాగేశ్వరరావు**

Beautiful City - Beautiful Hotel

DO NOT MISS




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# జలపాతాలే జనపాతకాలయ్యాయ్

# సీసాలో నీటి కొనుగోలు!



## నీరులేదు విద్యుత్ కరువు. నీవే తీర్చాలి ప్రభూ!



పురాణ కాలంలో అగస్త్యమహర్షి సాగరములన్నిటినీ ఒక కలశంలోకి తెచ్చాడని విన్నాం. కానీ యిప్పుడు అపారమైన జలసంపదని 'సీసా'లో పట్టియిస్తున్న వారి వద్ద క్రయం చేసి దాహార్తిని తీర్చుకుంటున్నాం. మనం చేసిన పాపాల ఫలితమో, యేమో 'పాల'నుకూడా 'మంచినీటి'లా అట్టపాకెట్లు, సీసాల్లో కొనుక్కుంటున్నాం.

పోతులూరి వీరబ్రహ్మంగారు కాలజ్ఞానంలో చెప్పినవన్నీ జరుగుతూన్నందుకు పౌరులు కొందరికి భయంగా ఉన్ననూ పాలకులూ, నాయకులకూ భయం లేకుండా ఉన్నది. దేవ, మౌన మునిగణం అంతా విహరిస్తుండే పవిత్ర హిమవత్పర్వతాల్ని పిండి పిండి చేస్తున్న పాపాన్ని ఉత్తరాఖండ ఉజ్వల ప్రళయంతో రుచి చూసాం. పరమశాంత స్వభావుడు, కోటాను కోట్లమందికి కోరినవరాలిచ్చే వేంకటేశుడు ఉగ్రరూపుడవుతాడని ఆనాటి పోతులూరి వీరబ్రహ్మంగారి నుంచీ యీనాటి పంచాంగకర్త సిద్ధాంతి ములుగు రామలింగేశ్వర ప్రసాద్‌గారు చెబుతున్నప్పటికీనీ, శేషుని పడగలనబడే కొండలను ఫిరంగులతో పిండి పిండి చేస్తూ వనాలను నరికివేస్తూ పెద్ద అంతస్థుల భవనాలను నిర్మిస్తూన్నడు తిరుమల కొండల్ని భయరహితంగా కాలుష్యపూరితం కావిస్తున్నామంటే భయం భయంగా ఉంది. అక్కడెన్ని జలపాతాలున్నా నీటికి కరువే!

వేసవి ఎండలు తీవ్రరూపం దాలుస్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా దాహం కేకలు మిన్నంటుతున్నాయి. ఇప్పటికే పల్లపు ప్రాంతాలకు పారిన నీరును భూగర్భ జలాలని పెంచేలా చేసిందా? అంటే అదీ లేదు. ప్రాణకోటికి ఆధారమైన నీటి నిలువలు లేక బోర్లు బావురుమంటున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో కరెంటు కోతలు పెరిగిపోతూ ఉండటంతో నీటి కోసం కిలోమీటర్ల దూరం నడచి వెళ్ళాల్సి వస్తోంది. నగరాలు పెరుగుతున్నందున నీటి ఎద్దడి పెరిగి అర్ధరాత్రుళ్ళు, అపరాత్రుళ్ళు అని లేకుండా మున్సిపల్ నీళ్ళు ఎప్పుడు వస్తాయోనని ఆశగా జనం ఎదురు చూస్తున్నారు. దాహార్తిని తీర్చుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు.

భవిష్యత్ భారతంలో నీటి కోసం యుద్ధాలు తప్పకపోవచ్చంటూ ఏనాడో భవిష్యత్‌ని చెప్పిన పోతులూరి వీరబ్రహ్మంగారి కాలజ్ఞానం అక్షర సత్యం కానున్నట్లే కనిపిస్తోంది. గుక్కెటి నీటి కోసం కిలోమీటర్ల మేర నడచి వెళ్ళివస్తున్న ప్రజల దాహం కేకలు, పాలకుల చెవికి వినిపించినా, పట్టించుకోని కారణంగా ఎక్కడి కక్కడ నీటికోసం యుద్ధవాతావరణం కనిపిస్తున్నది.

ప్రపంచంలో ఇప్పటికే అనేక దేశాలు నీటి సమస్యలో కొట్టుమిట్టాడుతున్నాయి. రానున్న రోజుల్లో ఇది మరింత తీవ్ర రూపం దాల్చే ఆస్కారం ఉందని చికాగోలోని స్కూల్ ఆఫ్ హెల్త్‌వారు ప్రకటించడం ఆందోళన కలిగిస్తుంది. ప్రపంచంలో కనీసం వందకోట్ల మంది నీటికోసం కిలోమీటరు దూరమైనా పయనించాల్సి వస్తుందని ఆ సంస్థ సమాచారం అందించినది.

మనదేశం ఇప్పటికే ఇరుగు పొరుగుదేశాలతో నానాపాట్లుపడుతోంది. ప్రపంచంలోని జలవనరుల సద్వినియోగానికి నడుం బిగించాలని ఇప్పటికే యునెస్కో పిలుపునిచ్చింది. నీటివనరుల లభ్యత, వృధాల పట్ల శ్రద్ధ వహించి దేశాల నడుమ వస్తున్న జలవివాదాలను పరిష్కరించేందుకు కూడా సిద్ధమవుతోంది. పరస్పరం అవగాహన, ఆమోదయోగ్యమైన పరిష్కారాల కోసం పలుసూచనలు కూడా చేస్తోంది.

ఇక మన భారతదేశంలో పేరుకుపోయినన్ని జలవివాదాలు ప్రపంచంలో ఎక్కడా కనిపించవు. రాష్ట్రాల మధ్య జలవివాదాలను సమసిపోయేలా చేయాల్సిన జలమండళ్ళు అగ్నికి ఆజ్యం పోసేలా వ్యవహరిస్తున్నాయి.

మన రాష్ట్రంలోనూ జలవివాదాలకు అంతే లేకుండా పోతోంది. చివరికి ప్రాంతీయ విద్వేషాలకు కారణమవుతూన్నది.

**సుజలాం... సుఫలాం...** అంటూ మన జాతీయ గీతంలోనే ఉన్నది. మన దేశంలోని నీటి సంపద విశిష్టతని చాటి చెప్పుకొన్నాం. కానీ వాస్తవానికి దేశంలో, రాష్ట్రంలో ప్రాంతాలవారీగా జిల్లాలు, గ్రామాలు ఇలా విడిపోయి గుక్కెటి నీటి కోసం కొట్టుకునే రోజులు దాపురించాయి. ప్రకృతితో ఇష్టానుసారం ఆటలాడి పర్యావరణాన్ని పాడుచేస్తున్న ఫలితమిది. సుజలాం... సుఫలాం... గీతం పాడడం చాలా మందికి యిష్టం లేదు. ●


బలం చేకూర్చి, భయం, పిరికి, పిశాచ, సర్పదోషాలను నివారించే

**నరసింహ స్వామి ఉంగరం**

ధర రూ. 400/- మాత్రమే

Narasimha Swamy Ring



సన్నగా, బక్కపల్చగా ఉన్నవారు, ప్రతి విషయానికి భయపడేవారు ఈ ఉంగరాన్ని ధరిస్తే బలం, ధైర్యం కలుగుతుంది. ఈ ఉంగరం ధరించడం వల్ల కారాగారవాసం, దాస్యం వంటివి నిర్మూలించబడతాయి. ప్రహ్లాదునికి రక్షణ నిచ్చిన ఈ స్వామి, ఈ ఉంగరం ధరించిన వాళ్ళకు సర్వకాల సర్వావస్థలలోనూ తోడూనీడై కాపాడుతాడు. ప్రతి రోజు "ఓం శ్రీం హ్రీం క్లీం ఐం శ్రీ నృసింహ స్వామి దేవతాభ్యో నమః" అనే మంత్రాన్ని పఠించి, ఈ ఉంగరాన్ని తాకితే వారికి ఎదురనేది ఉండదు. చేతబడి, బాణామతి, చిల్లంగి, దృష్టి, సమ్మోహనం, వశీకరణం ద్వారా కలిగే దోషాలను ఇట్టే నివారిస్తుంది. బుద్ధిమాంద్యం వున్నవారు, చురుకుదనం లేనివారు, చదువులో అంతగా రాణించని విద్యార్థులు, జన్మతహా మెదడు ఎదుగుదల సరిగా లేక తెలివితేటలు కరువైన వ్యక్తులు ఈ ఉంగరాన్ని ధరించినట్లయితే అన్ని శుభాలే కల్గుతాయి. ఉగ్ర నక్షత్రజాతకులైన శతబిషా, ఆరుద్రా, జ్యేష్ఠా, స్వాతి, విశాఖ, పూర్వాభాద్ర వారు తమ నక్షత్రానికి ప్రతీకైన ఈ నరసింహస్వామి ఉంగరాన్ని ధరిస్తే కార్యసిద్ధి కలుగుతుంది. సర్పశాపాలు, సర్పదోషాలు, కుజదోషాలు వున్నవారు ఈ ఉంగరం ధరించడంవల్ల ఈ దోషాల ప్రభావం ఉండదు. జన్మతః జాతకంలోని మూడొవ ఇంటిలో శుభగ్రహం ఉండేవాళ్ళకు ధైర్యం ఉండదు. ఇటువంటి వారు ఈ ఉంగరాన్ని ధరించినట్లయితే వాళ్లకు మంచి ధైర్యం లభిస్తుంది. వాతరోగాలున్నవారు, ఉన్మాదము, పిచ్చి వంటి అవలక్షణాలున్నవారు ఈ ఉంగరాన్ని ధరించడం మంచిది. అంటే వాతంవల్ల వచ్చే కండర, హృదయ వ్యాధులు దీనితో నిర్మూలించబడతాయి. ఇంట్లో ముగ్గురికి రాహుదశ నడుస్తున్నప్పుడు వారు ఈ ఉంగరం ధరిస్తే శుభాలను పొందుతారు. తులారాశిలో రవి ఉన్న వ్యక్తులు దీనిని ధరించడంవల్ల తండ్రితరపు ఆస్తి లభించడమేకాక, తండ్రితో సఖ్యత ఏర్పడుతుంది. రాహువు శుక్రునితో కల్సి మిధునరాశిలో ఉంటే పిశాచ పీడలుంటాయి. అంటే వీళ్ళకు పీడకలలు, ఎవ్వరూ చూడలేనటువంటి దృశ్యాలు కన్పిస్తుంటాయి. వీటిని నివారించడానికి ఈ ఉంగరాన్ని ధరించడం మంచిది. డా॥ చల్లా జయదేవానంద శాస్త్రి

పై పవిత్ర సామగ్రి కావల్సినవారు మాకు ఫోన్ చేసి మీ అడ్రస్ తెలియజేస్తే, పూజ చేసి, పోస్టల్ ఖర్చులు మేమే భరించి వి.పి.పోస్ట్ ద్వారా పంపగలం. మీరు పోస్ట్ మ్యాన్‌కు పైన తెలిపిన అమౌంట్ మాత్రం కట్టి ప్యాకెట్ తీసుకోవచ్చు.

Estd. 1975 PAVITHRA SAAMAGRI PARISODHANA NILAYAM BAKTHITODAY

:09840259871, 04424837505

BAKTHITODAY PAVITHRA SAAMAGRI PARISODHANA NILAYAM
Balabharathi Nilayam, Post Box No. 2645, New No. 49
Rangarajapuram Main Road, Kodambakkam, Chennai - 600024
www.bakthitoday.blogspot.com ; www.indiamart.com/bakthitoday-pavithra

T&C Apply



భగవంతునికి భక్తునికి అనుసంధానమైనది




అంబికా దర్బార్‌బత్తి

# సమదృష్టితో బ్రతకాలని మన ఉపనిషత్తులు బోధించాయ్!

కె. మల్లికార్జున, బళ్ళారి

***సమదృష్టి లోపించడం, కొందరిని నిందించడం, ప్రాంతీయ ద్వేషములు, అవగాహనం లేని మనుజులవల్లనే, సుఖజీవనం కోల్పోతున్నాం. సర్వేజనా సుఖినో భవంతు అను సనాతన ధర్మసారాన్ని పెడచెవిన పెడుతున్నాం. మన తలలపైన మనమే భస్మాసుర హస్తం పెట్టుకుంటున్నాం. పుడమిని మన జీవనాన్ని అగ్ని గుండానికి ఆహుతి చేస్తున్నాం.***

సమస్త జీవులు సుఖంగా బతకాలన్నది ఉపనిషత్ వచనం. భగవంతుని దృష్టిలో సమస్త జీవరాసులందరమూ సమానమే. ఆయన జీవులందరిపట్ల సమభావనతో వ్యవహరించి పంచభూతాలైన భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశాన్ని ఈచరాచర సృష్టికి అందజేశాడు. సమదృష్టి భగవంతునికి ఎంతో ప్రీతికరమైనదని మనకు తెలియుచున్నది.

పురాణపురుషులందరూ కులమతాలతో ఎలాంటి సంబంధం లేకుండా పేద, గొప్ప బేధం పాటించకుండా, తోటివారితో చెలిమిచేసి వారికి ఎల్లవేళలలా సహాయ పడుతూ, ముల్లోకాలకు ఆదర్శంగా నిలిచారు.

త్రేతాయుగంలో అటవిక జాతికి చెందిన శబరి భక్తితో, ప్రేమతో ఇచ్చిన ఎంగిలిపండ్లను శ్రీరామచంద్రుడు నిండు మనసుతో స్వీకరించి, ఆమెకు ముక్తిని ప్రసాదించాడు. ద్వాపర యుగంలో పేదరికంలో మగ్గుతున్న స్నేహితుడు కుచేలుడ్ని ఆదరించి, అభిమానించి సకల సంపదలను ప్రసాదించి శ్రీకృష్ణ పరమాత్ముడు తన ఉదారగుణాన్ని లోకానికి చాటాడు. ఈ సృష్టిలో అంతటా ఈశ్వరుడే ఉన్నాడు. అన్ని జీవ రాసులలో ఉన్న ఆత్మ ఒక్కటే అని వేదాంతం ఘోషిస్తోంది.

సమదృష్టికి ప్రత్యక్ష నిదర్శనం ప్రకృతి! ఎలాంటి తారతమ్య భావం చూపించకుండా ఫలసంపదతో ఉన్న పచ్చని వృక్షాలు అన్నీ జీవులకు ఫలాలను అందిస్తున్నాయి. సమస్త నదులు ప్రాణికోటికి సమదృష్టితో జలధారలు సమకూర్చి దాహార్తిని తీరుస్తున్నాయి.

ఈ కలియుగంలో ఆలోచనా, పరిజ్ఞానమును, మేధను, కలిగిన ఈ మనిషి మాత్రం ఈ మాన సమాజాన్ని, జాతిని సమదృష్టితో వ్యవహరించక, ఈ సమాజాన్ని, జాతిని అల్లకల్లోలం చేస్తూ ఉన్నాడు. తన స్వలాభం కోసం ప్రాంతాలను, మతాలను, కులాలను అపహాస్యం చేస్తూ అలజడిని సృష్టిస్తున్నాడు. మనస్సుకు శాంతిని, సుఖసంతోషాలను దూరం చేస్తున్నాడు. అంతేకాకుండా ప్రకృతిని అంతం చేస్తూ పాపమును మూటకట్టుకొనుచున్నాడు. మన హిందూ సాంప్రదాయం, మరియు సంస్కృతి ఇదికాదు.

భారతీయ వేద వాంఙ్మయము మాత్రము సృష్టిలో జీవులందరూ సర్వ సమభావనతో, సమదృష్టితో మెలగాలని ఉపదేశిస్తోంది. మనిషిని మనిషిగా గౌరవించే సంప్రదాయాన్నీ ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని కూడా ఉపదేశిస్తున్నది. అప్పుడే మనిషి విశ్వమానవుడుగా అందరి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతాడు.

మనలో కొంతమంది అంగవైకల్యం కలిగినవారిని చూస్తూ ఉన్నాం. వారిని హేళన చేస్తూ, వాళ్ళ వైకల్యాన్ని వేలెత్తి చూపిస్తున్నాము.

ఈ సమాజంలో ఈ రకమైన మనో వైకల్యం ఉన్నవాళ్ళు మనుషులుగా ఎదగలేరు. సమదృష్టితో వీళ్ళందరినీ ఆదరించడం నేర్చుకోవాలి. ఈ సృష్టిలోని ప్రతిజీవి ఆ భగవంతుడి ప్రతిరూపాలే. అందుకే ప్రతి మనిషిలో ఆ భగవంతుడిని తిలకిస్తూ, మనిషిని వేలెత్త చూడకూడదు. బిథోవన్ బధిరుడు, అయినా మంచి సంగీత విద్వాంసుడు. హెలెన్ కెల్లర్ చెవిటితనం, గుడ్డితనం, మూగతనంతో ఉన్నప్పటికినీ, జీవితాంతం బధిరులకు, అంధులకు సేవచేసి చరిత్రను సృష్టించారు. లూయీ బ్రెయిలీకి తన మూడవ సంవత్సరంలోనే అంధత్వం ఏర్పడింది. అయినప్పటికి తన పదో సంవత్సరంలో పాఠశాలకు వెళ్ళి అంధులకుగాను ఒక లిపిని కనుగొన్నాడు. అందుకే ఆ లిపిని 'బ్రెయిలీ' లిపి అని అంటారు.

సేవే లక్ష్యంగా చేసుకొని సమదృష్టి భావనతో రామకృష్ణులవారు రామకృష్ణ మఠాన్ని స్థాపించారు. మదర్ థెరిసా కులమత విచక్షణ లేకుండా మమత, మానవత, సేవాధర్మాలను మేళవించి అందరికీ మాతృమూర్తిగా మారింది.


లోకకల్యాణంకోసం పాటుపడే ఎవరైనా ఏ ఒక్కరినీ వేలెత్తి చూపించినా సహించరు. అందరినీ ప్రేమిస్తారు. స్నేహంగా ఉంటారు. సమదృష్టితో చూస్తారు. ఇతరులను దూషించరు. ప్రజల మనిషిగా ఎదిగి నవ సమాజ నిర్మాణంలో పాలుపంచుకోండి.

ద్వేషం ద్వేషాన్ని పెంచుతుంది. ప్రేమ ప్రేమను జయిస్తుంది. సాటి మనిషిలో అందరు భగవంతుణ్ణే చూడాలి. సర్వభూతాల్లో తనను చూసేవాడు తనకు అత్యంత ప్రీతిపాత్రుడని భగవద్గీతలో గీతాచార్యుడు చెప్పాడు.

మనిషి గొప్పతనమును అతని సమదృష్టిలోను, స్వభావంలోను తెలుస్తుంది. అంతే తప్ప అతడి సంపదలో, ఐశ్వర్యములో కాదు. సాటి మనిషిని నారాయణుడిగా గుర్తించాలని వివేకానందుడు సందేశమిచ్చాడు. ●

## శ్రీ పదార్చన-4
### (కోలాటం పాట)

-యస్. మునిసుందరం, తిరుపతి



ఏడుకొండలవాడు ఎంకటేశుడే
వాడు పామరులకు
ఇహమైనా పరమైనా వాడేగదే
ఇలలో.. ఆదుకునే సామివాడే గదే... ఏడు.॥
అలమేలు మొగుడటే ఆపదలు కూల్చునటే
సిరినీ రొమ్మును దాల్చి సినుకులా నవ్వునటే
వాడి నవ్వులకు
నేలతల్లి పులకించి పూసేనటే
పువ్వులు పూసేనటే... ఏడు.॥
అన్నమయ్య పాటలకు పొగిలి పొగిలి ఏడ్చెనట
వాడి ఆనందబాస్పాలే... సామి ఆనంద బాస్పాలే
సంద్రాలై పొంగెనటే
ఇంటింటా సామిపదం దీపంలా వెలిగినటే... ఏడు.॥
మొగిలి వాసనల సామికి మనసులుంటే ఇట్టమే
సన్నా సన్నాని మనుసులంటే
శానా శానా ఇట్టమే
లచ్చలు కోట్లూ జనం కొండకు సేరినా
ఇంకా ఇంకా రమ్మంటడే
ఆపదల మొక్కులసామి అభయమిస్తనంటడే... ఏడు.॥

*Compliments from*
**Sri Krishna Bhat**
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
Ring Road, Tirumala. Ph : 517504
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464